# జాషువా(28.9.1895 - 24.07.1971 )
# కవిత్వం - స్త్రీ జనాభ్యుదయం

ఆచార్య జి. అరుణకుమారి. తెలుగుశాఖ.
హైదరాబాదు విశ్వవిద్యాలయం

నవయుగ కవి చక్రవర్తి గుఱ్ఱం జాషువా 28 సెప్టెంబరు 1895న వినుకొండలో జన్మించారు.నేడు ఆంధ్రప్రదేశ్‌లో వారి 42 వ వర్ధంతిని, 117 వ జయంతిని జరుపుకుంటున్నాం.

"రాజు మరణించె ఒక తార రాలిపోయె
కవియు మరణించె ఒక తార గగన మెక్కె
రాజు జీవించు రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకల యందు" [1]

అని జాషువా అన్న మాటలకు ఈనాడు మనం జరుపుకుంటున్న జయంతి,వర్ధంతి సార్థకతను చేకూరుస్తున్నాయి.

ముప్పైకి పైగా రచనలు చేపట్టిన జాషువా పేరు వినగానే గుర్తుకు వచ్చేది గబ్బిలం కావ్యం. వస్తువులోను, భావంలోను నవ్యత, ఒక జీవుని ఆవేదన, శాంతియుత ఉద్యమ స్ఫూర్తి, భావి తరాలకు సందేశం, సమతాభావం, సామాజిక దృక్పథం ఉంది కాబట్టి ప్రజల నాలుకల యందు సుకవి జాషువా నిలిచి ఉన్నాడు.

**1.గబ్బిలం :** ఆనాటి సమాజంలో నాలుగు పడగల హైందవ నాగరాజు వేయి పడగలతో వర్ణ ధర్మాల అమలును కాంక్షిస్తుంటే ఆ శక్తులను ఎదుర్కోవటమే తన కర్తవ్యంగా భావించి గబ్బిలం రచనకు జాషువా పూనుకున్నారు. ఆధునికాంధ్ర సాహిత్యంలో ఖండకావ్య ప్రక్రియకు విశిష్ట స్థానాన్ని కల్పించిన వారు జాషువ. జాతీయోద్యమంలో భాగంగా సంస్కరణోద్యమం వంటి శక్తుల వలన ప్రమాదం ఉందని 1941లో గబ్బిలం ఖండకావ్యన్ని రచించారు.

తన ఇష్టదేవత, తన జాతికి కేతన చిహ్నమైన గబ్బిలానికతడు మరికొన్ని చింతాసందేశాలను చెప్పుకున్నాడు. ఫలితమనుభవించే భాగ్యం ఆ గర్భదరిద్రునికి ఉన్నదో లేదో తెలియదు కాని "నేడుగాక మరొకనాడు ఫలించును" అనే ఆశ మాత్రం కవి మాటల్లో తెలియవస్తుంది.

చెప్పులు కుట్టి జీవనం చేసే గర్భ దరిద్రుడు, నీతిమంతుడు, అరుంధతీసుతుడు అయిన ఆ నిరుపేద తన స్వీయ వృత్తాంతాన్ని చీకటిముద్ద, లేత కస్తూరి ముద్ద వంటి పుల్గురాణి గబ్బిలానికి విన్నవించుకున్నాడు.

'ముక్కు మొగమున్న చీకటి ముద్దవోలె
విహరణము సేయసాగె గబ్బిల మొకండు' [2]

'ప్రవిమల దేవతాభవన వాసము చేయుచు మిమ్మువంటి మానవులకు లేని
గౌరవమునం దులదూగెడు గబ్బిలాల రాణివిగద నీవు....'[3]

అని చీకటి ముద్దలా కనిపించిన గబ్బిలాన్ని పురుష గబ్బిలంగా సంబోధించి ఆపై గబ్బిలాల రాణివి కద నీకు స్వాగతమని పలికాడు. దబిసి పిట్ట, సహోదరి,పరోపకారిణీ, సాత్వికాహారిణీ,పక్షిభామినీ,పక్షిసుందరి,పక్షికళ్యాణి,పుల్గుపుణ్యాంగన,పుల్గుదొరసాని, ఋషిఖగాంగన,ఖగసన్యాసిని,ఖగవధూటి,ఖగరాజ్ఞి, గబ్బిలపుదేవి, గుబ్బెతలరాణి,రాణి, పుల్గుటక్కా అని గబ్బిలాన్ని సంబోధించటాన్ని గమనించవచ్చు. గబ్బిలానికి ఎగిరే గుంట నక్క అనే పేరున్నా ఎక్కడా నిందాపూరితమైన పదాలను వాడకపోవటాన్ని గమనించినట్టయితే గబ్బిలంపై ఆయనకున్న కారుణ్యం ఎంత గొప్పదో తెలుస్తుంది. గబ్బిలం ఖండ కావ్యంలో తన స్వీయవృత్తాంతాన్ని చెప్పి దేశానర్థకాలైన అనేక విషమ సమస్యలను ఈశ్వరునికి విన్నవించమని దౌత్యానికి మృగపక్షిత్వ ధర్మమున్న గబ్బిలాన్ని అందునా ఆడ గబ్బిలాన్ని కవి ఎన్నుకున్నారు. పేదలకు పులుగు పుట్రలే కదా ఆప్తులు.

అస్పృశ్యత, వర్ణ వ్యవస్థ నిరసన, అనైకమత్యం, స్వార్థలబ్ధత, బహుకుల మతావేశ వ్యాధి పీడ వంటి జాడ్యాలకు గురైన పీడిత తాడిత పంచమ జాతికి ప్రతినిధిగా గబ్బిలాన్ని ఎన్నుకున్నారు.

కాళిదాసు మేఘ సందేశం గబ్బిలం కావ్యానికి ప్రేరణే అయినా వస్తువు భిన్నమైనది. రాజ భోగ చిహ్నాలైన పక్షులకు అస్పృశ్యుని కన్నీటి కథ వినిపింపవు.

2. **అనాథ :** అనాథ కావ్యంలోని స్త్రీ మూర్తి నిరుపేదరాలు,మాలవనిత, జోగురాలు ఐదుగురు కొడుకులతో, చంటి బిడ్డతో భర్తను పోగొట్టుకొని ఒక పేదరాలు అన్నం కోసం అలమటించిన విధానాన్ని ఈకావ్యం వర్ణిస్తుంది. పిల్లల తల్లి అన్నం కోసం సమాజంలో అలమటించిన రీతిని కవి వర్ణించాడు. జవరాలు, యువకుడు, బుద్ధిమంతురాలు, చదువుకున్న స్త్రీ, సంసారి, పురుషుడు, సరసమాడే దంపతులు, పంతులు దీనురాలి పట్ల ప్రవర్తించిన తీరు అనాథ కావ్యంలోని ప్రధాన అంశం.

1. పదహారేళ్ళ జవ్వని ఉదాసీనంగా మాట్లాడి జలపాత్రను కాలితో తన్నింది.
2. షోకిల్లా బండి మీద వచ్చి పేదరాలిని గుద్ది గాయపరచాడు.
3. సరసమాడే దంపతులు పేదరాలి విషయం తెలుసుకొని మళ్ళీ ప్రణయరాజ్యంలో తేలారు.
4. సంసారి ఒకడు గాయపడ్డ పేదరాలిని భిషక్కు ఇంటికి చేర్చి ఆరు వరాలిచ్చి వైద్యం చేసాడు. అమ్మలక్కలు అతని భార్యకు ఫిర్యాదు చేసారు. "ముక్తి కలుగునె మాలల బులిమికొన్న" [4]
5. కుల భేద పిశాచ తృప్తికై భార్య చెప్పినట్టు స్నానమాచరించాడు.
6. జోగురాలి కొడుకులను చదివిస్తానని పంతులు ముందుకొచ్చాడు.
7. పెంపుడు కుక్కకు ఉపచరించే పురుషుడు ఆగ్రహించాడు.
8. 'నరులకు ధర్మువనకును గలుగునే కుల వివక్ష' [5] అని చదువుకున్న తల్లి భోజన భిక్ష పెట్టి ప్రేమను వర్షించింది

1932లో రచించిన కావ్యం అనాథ. ఈ కావ్యంలో స్త్రీ, పురుషులు పేదరాలి పట్ల ఆదరణ, నిరాదరణ గలవారుగా కనిపిస్తారు. యవ్వనంలో ఉన్న వారికి ఆదరణ ఉండదనే భావం కలుగుతుంది. భాగవతంలో శ్రీ కృష్ణుని మధురానగం ప్రవేశంలో ప్రణయ కేళిలో ఉన్న స్త్రీ శ్రీ కృష్ణుని సందర్శనానికి పరుగున వచ్చిందట. కాని ఇక్కడ వచ్చినది జోగురాలు. అప్రణయ దంపతులు విషయాన్ని తెలుసుకొని ఊరటపడి ప్రణయ రాజ్య విహారంలో తేలిపోయారు. గురజాడ 'తోకచుక్క' గేయంలో సహపంక్తి భోజనాల వలన ఒరిగేదేమి లేదని, సంస్కర్తవైతే మాలవనితను మరులుకొనరాదో అని నిలదీసింది.

పరుల దుర్గతిని చూసి వగచే సహృదయుల కన్నీటి బొట్టులోనే భగవంతుడున్నాడు. కరిగే గుండెగల మనుష్యులలోనే భగవంతుడిని చూడమంటున్నాడు కవి.

'పరుల దుర్గతి గని గుండె గఱగి వగచు
సదయ హృదయుల వీక్షణాంచలము నందు
బుట్టుచుండును కన్నీటి బొట్టువోలె
ఏడి భగవంతుడని సంశయింతువేల'[6]

జోగిని గురించి ఆనాడే 1932లో రచన చేపట్టారు. వీరి కుమార్తె హేమలతాలవణం జోగినుల సంస్కర్తగా నిలిచారు. కార్ల్‌మార్క్స్ దాస్ కేపిటల్‌లో కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను ప్రతిపాదాంచాడు కాని తాను కమ్యూనిస్టును కానని అన్నాడు. జాషువా దళిత అభ్యున్నతిని కోరాడు. కాని నేను విశ్వనరుడనని అన్నారు. జాన్‌రస్కిన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఈ కావ్యంలో స్ఫురిస్తాయి.

**స్వప్నకథ:** పన్నెండేళ్ళ బాలుడు ముసలివగ్గును స్వీయచరిత్రను చెప్పమని కోరాడు. రెడ్డిసానికి జనించిన మానవకాంత స్వప్న కథలోని పేదరాలు. పుట్టిన రెండవ వారంలోనే తల్లిదండ్రులను చంపిన దానివి అని పౌరకాంతలు భీతితో ముట్టుకునే వారు కారు. సాలెవారు పెంపకంలో పెరిగిన సాలెస్త్రీ యుక్త వయసు వచ్చినా మరో ఆలోచన లేక పరుల కష్టాలను కని ఓర్చుకోలేక పోయింది.

1. పెంచిన తల్లి అనుమతితో ముసలి వానికి ఆరుగజాల బట్టనేసి ఇచ్చింది. ఆమె భోజనంలో సగం నిరుపేద కిచ్చి సగంతో జీవనం చేసి జీవితాన్ని సార్థకం చేసుకుంది. మారు తల్లి మరణం, అక్క చెల్లెళ్ళ అసూయ కారణంగా బిచ్చగానితో చేరి భిక్షుకురాలయ్యింది. ముసలివానికి పరిచర్యలు చేసినందున జారిణి అని నిందించారు.
2. ఒక లేమ, ఒక తల్లి, ఒక చుప్పనాతి, ఒక కుటింబిని భిక్షుకురాలి పట్ల ప్రవర్తించిన తీరు ఈ స్వప్నకథలో కనిపిస్తుంది.
3. భిక్ష పెట్టలేక దీన స్థితిలో ఉన్న బాపనమ్మకు నాలుగణాల డబ్బు ఇచ్చింది.
4. దిన వెచ్చం ఇవ్వడానికి సమ్మతించిన వాని వెచ్చాన్ని బ్రాహ్మణ విధవకు ఇచ్చింది.
5. వృద్ధుని చంపిందని కారాగార శిక్ష పడింది. అక్కడ వృద్ధుని ఆకృతితో ఒక బ్రహ్మతేజస్వి పడుచువాడు కనిపించాడు. భూ వలయంలో జీవింపలేనని తావకపదాబ్జముల సన్నిధానానికి తీసుకుపొమ్మని వెళ్ళిపోయింది.

పేదరికాన్ని వింత విద్యాశాలగా చూడగలిగిన మొదటి వ్యక్తి జాషువా. పేదరికమే జాషువా కవితా సామాగ్రి. పేదవాడికి సమాజంలో ఎదురయ్యే సమస్యల అధ్యయనమే జాషువా విద్యాశాల. పేదరికపుటంచులను చూసిన జాషువా ఏ విద్యావేత్త చెప్పని నిర్వచనాన్ని పేదరికానికి అందించారు.

'పేదతికము పెద్ద వింత విద్యాశాల' స్వప్నకథ, పుట 33

'నీకన్న మంద భాగ్యలనేకులు గలరమ్మ

ఈ కుల మాకుల మన కని' ఊరడించింది స్వప్నకథ, పుట 35

సమాజంలో భిన్న వయస్కులైన స్త్రీలు పేదల పట్ల వ్యవహరించిన తీరును అందునా ఆకలితో ఉన్న పేదవారిపట్ల వ్యవహరించిన తీరును అనాథలోను, స్వప్నకథలోను, కవి వర్ణించారు. సమాజంలోని స్త్రీలలో మార్పురావాలని, పౌరులుగా వారి బాధ్యతను గుర్తెరగాలని కవి ఆశించారు.

స్వప్నకథ 1932 లో రచించారు. ముసలి వగ్గు తన జీవిత చరిత్రను బాలుడికి వివరిస్తుంది. Flash back పద్ధతిలో నడచిన కథ ఇది.

కులం వల్ల మాత్రమే కాదు అస్పృశ్యత, పురిటిలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న పేదపిల్లను పౌరకాంతలు భయంతో తాకరు. తల్లిదండ్రులను పోగొట్టుకున్న అనాథను కూడ అస్పృశ్యురాలుగానే భావించారు. అమ్మలక్కలు తిరోగమన మనస్కులుగా ఉన్నారనే అంశాన్ని జాషువా విమర్శించారు.

**<u>ముసాఫరులు:</u>** ఈ కావ్యాన్ని 1963 లో రచించారు. చిరుప్రాణి వీర యోధుని స్వీయ వృత్తాంతాన్ని చెప్పమని ప్రబోధింపమని అడుగుతాడు. 'భూతల జీవనంబను కూలంబగునె తెల్పు' మని ప్రశ్నించాడు. ఇంకా శరీరాన్ని, కులాన్ని ధరించని చిరు ప్రాణి ప్రశ్న. జీవి పుట్టుక, మరణం వంటి తాత్త్వికాంశాలను ఈ కావ్యంలో జాషువ చర్చించారు.

'మగ తెగయు నాడు తెగయును
తెగలున్నవి రెండు ఆడు తెగలేకున్నన్
మగతెగకు పుట్టుగతి లే
దగణ్యములు రెండు తెగల అనుబంధంబుల్ '

ముసాఫరులు, పుట 20

'ఆడుది లేకుండిన నీ
రేడు జగంబులను శోభయే లేదు నరుం
డూడిగపు యంత్రమనుకొని

కవి స్త్రీ అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. స్త్రీని ఊడిగం చేసే యంత్రంగా భావిస్తున్నారు. మానవ జననం గురించిన తాత్త్విక దృక్పథం ఈ కావ్యంలో ఇమిడిఉంది. మరణించిన వీరయోధుడు, జనించాలని కోరికగల చిరుప్రాణి మధ్య కొనసాగిన సంభాషణ. ఆ చిరుప్రాణి ఈతపుర్వువలె కవిప్రవరుడై జనించాడు

'నా జననం' కావ్యంలో పతివ్రతగా బిరుదు పొందాలని హృదయేశ్వరుడే ఈశ్వరుడన్న నమ్మకంతో భార్య ఓపికతో చరణార్చనాదులు చేసింది. ఆనాడు సమాజంలో స్త్రీకి ఉన్న వివాహబాంధవ్యాన్ని వివరించారు. భర్త మరణించినా, భర్త ఉన్నా కాంతల అభాగ్యదశకు సడలింపు కొంత కలిగిందని కవి భావించారు. జననం, మరణం, పెళ్ళి, ముసలితనం, కులం.....మొదలైన అంశాలను ఈ ఖండకావ్యంలో పేర్కొన్నారు.

**ముంతాజ్‌మహాలు:** షాజహాను ముంతాజ్‌కు ప్రేమచిహ్నంగా మహాలు కట్టించాడు. కవి జాషువా భార్యకోసం ప్రేమ చిహ్నంగా కృతి శతములచే బ్రతికించి రతనాల(సమాధి) మందిరం కట్టాడు.

మృతులకు మీరు జన్మంబులు
కృతులె కదా దేవి యట్టి కృతిశతములచే
బ్రతికించి నీకు జక్కని
రతనాల సమాధి మందిరము గావింతున్ పుట 93

ముంతాజ్ 'భాగ్య బంధురమగు నిండు బండి వోలె' నడయాడింది. నరుల జన్మ ఆవిరి ఓడలో జలధి యాన మొనర్చెడు బాటసారుల వంటిది. షాజహాన్ సతీమణి ముంతాజ్ మరణం 'జీవరత్నంబువగు నిన్ను స్వీకరించి వట్టి రతనాలు నాయింట వదలినాడు' అని కవి స్త్రీ ఔన్నత్యాన్ని చిత్రీకరించారు.

**కొత్తలోకం** : జాషువా ఆశించిన కొత్తలోకం ఇది. ఆ లోకం ఎలా ఉండాలని కోరుకున్నారు? శ్రీశ్రీ మరో ప్రపంచాన్ని సామ్యవాద దృక్పథంతో చూసారు. జాషువా విశ్వనరుడై విశ్వమానవతా దృక్పథంతో సమాజాన్ని వీక్షించారు. వీరి కవిత్వానికి జీవితానికి  తాదాత్మ్యం ఉండడం వలననే నవయుగ కవిగా రాణించారు. స్వీయచరిత్రలు చెప్పే పాత్రలు, సంభాషణాత్మక కథనం, ఒక వైపు సమాజాన్ని, ఒక వైపు సంప్రదాయాల్ని, ఒక వైపు మానవులను, మనస్తత్వాలను, కులం పూసే రంగులను, ఆకలి వేదనలను, స్త్రీలను, సాహిత్యాన్ని పలు కోణాలలో దర్శించి విశ్వమానవతను చాటి చెప్పాడు. సమస్యలను చెప్పి వాటికి పరిష్కార మార్గాల్ని సూచించటమూ వీరి కవిత్వంలోని ప్రత్యేకత. ఉదాహరణకు స్వప్నకథలోని పేదరాలు 'సగటు నిరుపేదకిడి తక్కువ సగము తోడ జీవనము సేయుచుంటి' నని బాధ్యతను గుర్తెరిగినట్లు కవి వివరించారు.

సమాజంలో పురుషుల మనస్తత్వాలను, భార్యపట్ల పురుషుల ప్రవర్తనను వివరించి స్త్రీపురుషుల మధ్యఉన్న  తారతమ్యాన్ని విశ్లేషించి స్త్రీని గౌరవించని పురుషునికి స్త్రీత్వం ఇవ్వాలని కవి హెచ్చరించారు.

'కాంతలను సృష్టి చేయని కారణమున
పెండ్లియాడిన భార్యల పిప్పిజేసి
తరుముచున్నవి పురుష భూతములు కొన్ని
స్త్రీత్వమిడి యట్టివారి శిక్షింపవోయి'। కొత్తలోకం, పుట 56

'పురుషుల్ నిర్మితిచేయు సాంఘిక మహాభూతంబు పెన్గోరలం
దిరికింపంబడి దుష్టభర్తల కృపాహీన ప్రవృత్తుల్ హృదం
తరమున్ ఆంపపుకోత గోయ నిజహత్యా నేరముల్ చేయు సుం
దరుల న్నీ వెటు లూరడింతువొ మహాత్మా! ప్రేమ వారాన్నిధీ'!          పుట 56

స్త్రీకంటె పురుషుడు శ్రేష్ఠమని గ్రంథాలు వక్కాణిస్తున్నాయి. స్త్రీకి ఏ కాలంలోనూ స్వేచ్ఛలేదు. సమాన గౌరవాన్ని స్త్రీకి  కల్పించాలని జాషువా ఆశించారు.

'స్త్రీ కంటె బురుషుండు శ్రేష్ఠుడనుచున్ సిద్ధాంతముల్ చేసితా
టాకుల్ కంఠములెత్తి స్త్రీ జగతి కన్యాయంబు గావించెనో
యేకాలంబున పుట్టినింటయిన లేవేనాటి స్వాతంత్ర్యముల్
స్త్రీకిన్ మారు సమాన గౌరవవిభూతిన్ గాంతకుం గూర్పుమా'!          పుట 56

పురుషులు నిర్మించిన సాంఘిక ఆచార భూతాల కోరలలో చిక్కి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, పురుష భూతాలు భార్యలను పెళ్ళి పేరులో హింసిస్తున్నారని, అటువంటివారికి స్త్రీత్వమివ్వాలని దానిమూలంగా స్త్రీలపై గౌరవం  పెరుగుతుందని జాషువ ఆభివ్యక్తీకరించారు. తాటాకు గ్రంథాలు స్త్రీ కంటె పురుషుడు శ్రేష్ఠుడని కంఠాలెత్తి స్త్రీకి అన్యాయం చేసారు. పురుషుడితో పాటు స్త్రీకి కూడ సమాన గౌరవం కావాలని కోరారు.

కోడలిగా, భార్యగా సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలను, పురుషులు భార్యలను హింసించిన పతివ్రతలుగానే నిలవాలనే భావాలను కవి వర్ణించారు. పతివ్రత ధర్మమనే కట్టుబాటును భగవంతుని వివిధ అవతారాలు కూడా తెంచ లేకపోయాయని జాషువ ఆవేదనను వ్యక్తంచేసాడు.

కలరు పతివ్రతల్ కలియుగంబున గూడ, గయాళులైన యు
త్తల కరకుందనమ్మునకు దాళి పొగల్  సెగలన్ వెలార్చు భ
ర్తల పదపద్మముల్    గొలుచు దైవకాంతలు, వారి వేదనా
జ్వలన శిఖావళిం జిదుమ జాలవు నీ వివిధావతారముల్'

కలియుగ సమాజంలో పతివ్రతలు, దైవకాంతలు ఉన్నారంటారు కవి. గయ్యాళి అత్తల కరుకుదనాన్ని భరించే పతివ్రతలు, పొగలు సెగలు కక్కే భర్తలను కొలిచే దైవకాంతలున్నారు. వీరి వేదనా జ్వాలని వివిధావతారాలు పోగొట్టలేవని ఆవేదన పడ్డారు జాషువ.

కొత్తలోకంలో 'మలికోర్కె' లో అర్థాంగి రెండవ స్వర్గంబయి యేలుతుంది అని సతీవియోగం ఎంత హింసాత్మకమో వివరిస్తూ ఇంకొక్క మారు ఆయుస్సుపోసి అర్థాంగిని ఇవ్వమని అర్థిస్తున్నాడు. మంచి భార్యగా నిలిచిన స్త్రీకి పురుషుడు ఇచ్చే గౌరవాన్ని ఈ పద్యం వివరిస్తుంది.

నా యర్థాంగిని నాకొసంగు మభిమానంబుంచి యింకొక్కమా
రాయుర్థాయము బోసి కోరను త్వదీయ స్వర్ణ వైకుంఠమున్
నీ యూరింపు టమర్త్య భోగములు నానెయ్యంపు టిల్లాలు నా
కీ యుర్విన్ సమకూర జేయగలదోయి। లోకలోకేశ్వరా।

మలికోర్కె ,పుట 69

మనమత్యృత్తమ వంశజాతులము సుమ్మా। నీచులంజేరవ
ద్దని లేబ్రాయమునందె బిడ్డల కసూయాద్వేషముల్ నేర్పి,క
మ్మని బుద్ధుల్ విషతుల్యముల్ సలుపు నమ్మల్ నమ్మరీనాటి నూ
తన సామాజిక సత్య శాంతి సమతా ధర్మ ప్రబోధమ్ములన్

కొత్తలోకం, తొలికోరిక పుట 66

విషతుల్య బీజాలను నాటే అమ్మలకు నేటి సామాజిక ప్రబోధాల విలువలు తెలియటం లేదని చింతించారు. మాతృత్వం గురించి ప్రస్తావిస్తూ వారి బాధ్యతను సూచించారు.

బూచి బూచి యనుచు బుత్రుల వెరపించు
పిరికి తల్లి మున్ను పెంచదెవని
క్రోలినార లుగ్గుబాలతో లోకాల
వీర రసము దల్లి నూరిపోయ

జాషువా స్త్రీ అభ్యుదయాన్ని ఆశించి చెప్పిన మాటలివి.

మనుజుం ఉగ్రరణంబులో మడిసి రంభంగూడు నంద్రాజిలో
తనువుం బాసిన వీర కాంతలను నేతద్దోశ మెట్లబ్బునో
యని ప్రశ్నింప జవాబురా దబల కిందందున్ గతుల్ డుల్చివం
చన గావించు కథాప్రణేతలను పశ్చాత్తప్తులం జేయుమా।

కొత్తలోకం, పుట 66

రణంలో మరణించిన పురుషుడు రంభను కూడి సుఖిస్తాడని అంటారు. మరి యుద్ధంలో తనువులు బాసిన వీర కాంతలకు ఆ భోగం ఎట్లమరుతుందని జాషువా ప్రశ్నించి వంచన చేసే కథా చక్రవర్తులను చేసిన తప్పుకు పశ్చాత్తాపం పొందేట్టు చేయమంటున్నాడు.

**నేతాజి**: ఇంటిని తీర్చి దిద్దే యంత్రాలుగా, పరాదాలలో బంధితులుగా భారతీయ స్త్రీలు స్వార్థ ఆశయాలకు నీతులకు పొంగిపోయి స్వర్గాన్ని పొందుతున్నామని సంతోషిస్తున్నారు. సొమ్ములతో, ఎమ్మెలతో, పురాతన కథా పుణ్యప్రసంగాలతో సంతృప్తి చెందుతున్నారు. పెద్దలు చెప్పే దొంగధర్మాలకు, భర్త ఎంతటి దురాత్ముడైన సహించమని, ఎదురించవద్దని 'చిలుకల చదువు' నేర్పించి అబల అనే పేరునంటగట్టారు. స్త్రీలకు జ్ఞాన సంపద పెంపొందకుండా చిత్రచిత్రాలుగా ఆణచివేసారని జాషువా బాధను వ్యక్తంచేసారు.

'సతుల నైసర్గిక జ్ఞాన సస్యరమును
చిత్రచిత్రంబుగా హత్య చేసినారు'

జాషువ రచనలు, రెండవ సంపుటము, నేతాజి, పుట 189

"కలుపుంగోలు తనంబు తేటపడ నుత్కంఠన్ మొగాలెత్తి
మూతులు మూతుల్ గదియించి ముద్దుగొని సంతోషించు చిన్నారి చీ
మలయందున్న పరస్పర ప్రణయ సంపత్తిం ప్రసాదించి మ
ర్త్యుల బుట్టింపుము కొత్త లోకమున కొల్తున్ నిన్ను ముప్రొద్దులన్"

జాషువా రచనలు, 3వసంపుటం, కొత్తలోకం, తొలికోర్కె పుట.57

నా కవితకు నా ప్రతిభా
శ్రీకిల గారణము నాదు ప్రేయసి మహిళా
లోక శిరోమణి మేరీ
చాకిరి నన్నంత వాని సలిపెం దలపన్.

నాకథ, తృతీయభాగం., పుట174

జాషువా తన కాలానికి కంటె ముందు చూపుతో ముందు తరాలకు మార్గదర్శిగా నిలిచారు. పెదరికంలో భిన్న పార్శ్వాలను, భిక్షించి ఆ పేదరికానికి సమాజం ఏవిధంగా స్పదించిదనే అంశాలను తన రచనలలో పరామర్శించారు. పేదవాడిని, పేదరికాన్ని సామాజికులు దర్శించిన తీరును భిన్న కోణాలలో ప్రదర్శించారు. పేదలు సహాయం పొందడమే కాదు, వీరు ఆసహాయులకు సహాయం చేసే తీరును కూడా రచనల్లో పొందుపరచారు. ఒక అంశాన్న ఒకే కోణంలోనే కాదు పలు కోణాలలో దర్శించాలనే భావం వీరి రచనల మూలంగా మనం గ్రహించే ప్రధానాంశం.

He lived beyond his times

మనిషికి మనిషికి మధ్య అగాధాన్ని స్పష్టించిన వర్ణవ్యవస్థకై ధ్వజమెత్తారు. బహుముఖ విషయ పరిజ్ఞానం గల జాషువ తన రచనల్లో అనేకాంశాలను ప్రదర్శించారు.కవులు జేప్పేదానిని కాలం అనుసరిస్తుంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**


1. జాషువ, కొత్తలోకం, వ్యత్యయము, జాషువ రచనలు, మూడవ సంపుటం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు,
2. జాషువ, గబ్బిలం, విజ్ఞప్తి
3. గబ్బిలం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు. 2004.

4,5. అనాథ, ప్రోగ్రసివ్ ప్రింటర్స్, విజయవాడ, 1976)

6. జాషువా ముసాఫరులు, ఇన్సాన్ ప్రింటర్స్, విజయవాడ, జూలై 1982
7. జాషువా, కొత్తలోకం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హైూమ్, హైదరాబాదు మార్చి 2008
8. స్వప్నకథ, ప్రోగ్రసివ్ ప్రింటర్స్, పటమట, విజయవాడ - 1976
9. నేతాజి, వాణి బుక్ డిపో, భీమవరం.